క్లుప్తంగా

నేటి నుంచి జాతర

మోమిన్‌పేట: మండల పరిధిలోని దుర్గంచెర్వు గ్రామంలో శుక్రవారం నుంచి భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి జాతర ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు నందిగోల కార్యక్రమం, రాత్రికి భజనలు, శనివారం ఉదయం 6గంటలకు అగ్నిగుండ ప్రవేశం, 10గంటలకు రుద్రాభిషేకం, సాయంత్రం 5.30 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, రాత్రికి రథోత్సవ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఆదివారం జాతర మహోత్సవ కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో రావాలని వారు కోరారు.

వైభవంగా బీరప్ప విగ్రహ ప్రతిష్ఠ

మోమిన్‌పేట: మొరంగపల్లిలో గురువారం బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం విగ్రహాలకు వేద మంత్రోచ్ఛారణలతో ప్రాణప్రతిష్ఠ నిర్వహించి గణపతి పూజ చేశారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ స్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం చేశారు.

26 నుంచి క్రికెట్ టోర్నీ

తాండూరు రూరల్: మండల పరిధిలోని సంగెంకలాన్ గ్రామంలో ఈ నెల 26వ తేదీ నుంచి లోకయ్యగౌడ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నటు బీఆర్‌ఎస్ పార్టీ బీసీసెల్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఆసక్తిగల క్రీడాకారులు టోర్నీలో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99019 61646, 93939 79738, 63039 30149 ఫోన్ నంబర్లను సంప్రదించాలని చెప్పారు. ఈ టోర్నీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి పాల్గొంటారని నిర్వాహకులు చెప్పారు.

ఘనంగా కల్యాణమహోత్సవం



దేవతామూర్తులకు కల్యాణం చేస్తున్న పూజారి వినోద శర్మ

మర్పల్లి: పార్వతీదేవి సహిత సంగమేశ్వర దేవతా మూర్తులకు 23వ కల్యాణమహోత్సవాన్ని సంగమేశ్వర ఆలయంలో గురువారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, 10 గంటలకు రుద్రాభిషేకం మధ్యాహ్నం 12 గంటలకు వినోద్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో పార్వతీదేవి సహిత సంగమేశ్వర దేవతా మూర్తులకు కల్యాణం జరిపించారు. వేడుక అనంతరం పార్వతీదేవికి మహిళలు ఒడిబియ్యం పోసి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి ప్రధాన వీధుల గుండా హనుమాన్ మందిరం వరకు పల్లకీ సేవా నిర్వహించారు. ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్



కలెక్టర్‌ను కలిసిన చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

తాండూరు: మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, కౌన్సిలర్లు గురువారం కలెక్టర్ నారాయణరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అనంతరం మున్సిపాలిటీని సందర్శించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు నీరజ, బొబ్బిలి శోభారాణి, బోయరవిరాజ్ తదితరులున్నారు.

విద్యార్థినులకు తైక్వాండో శిక్షణ

తాండూరు: మల్‌రెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో బాలికలకు ఆత్మరక్షణ విద్యపై శిక్షణ ఇచ్చారు. బాలికలకు ఆత్మరక్షణ విద్య నేర్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏటా డిసెంబర్ నెల నుంచి తైక్వాండో విద్యపై శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగానే గురువారం మల్‌రెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో శిక్షకులు మాస్టర్ బస్వరాజ్ బాలికలకు శిక్షణ ఇచ్చారు.

క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ

శంకర్‌పల్లి: యువత క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని శంకర్‌పల్లి పీఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. మహాలింగపుర శివాజీ యువజన సంఘం యువకులకు క్రికెట్ ఆయన కిట్టును అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. క్రీడలతో యువకుల్లో స్నేహభావాలు పెంపొందుతాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్, రవీందర్, అనిల్, మధు, రవి తదితరులు పాల్గొన్నారు.

వేతనం అందక వెతలు!

డిజిటల్ కాలంలో ప్రతీ అంశం కంప్యూటరీకరణతోనే ముడిపడుంది. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారుల ఆదేశాలను క్షేత్రస్థాయిలో పంపించేందుకు అధికారికంగా జీమెయిల్ వంటి ఆన్‌లైన్ సర్వర్లను ఉపయోగించుకుంటున్నారు. డిజిటల్ పనులు విజయవంతంగా కొనసాగుతున్నప్పటికీ.. ఈ పనులు నిర్వహించేందుకు నియమించబడిన కంప్యూటర్ ఆపరేటర్ల జీవితాలు దుర్భరంగా మారాయి.

- ఆర్థిక ఇబ్బందుల్లో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది
- పౌర సేవలందిస్తున్నా.. పూటగడవటం కష్టమే
- సకాలంలో జీతాలు విడుదల చేయాలని అభ్యర్థన



కుల్కచర్ల తహసీల్దార్ కార్యాలయం

కుల్కచర్ల: జిల్లా పరిధిలో 19 రెవెన్యూ మండలాలు ఉన్నాయి. వీటిలో 23మంది ఔట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరు ఆయా మండల తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లుగా పౌరులకు అవసరమైన సేవలు అందిస్తున్నారు. కులం, ఆదాయం, నేటివిటీ, డెత్ సర్టిఫికెట్ తదితర ధ్రువపత్రాల సేవలను అందించడంతో పాటు.. రెవెన్యూ సంబంధిత పనులను నిర్వహిస్తున్నారు. కొంతమంది ఆర్డీఓ కార్యాలయంలో, మరికొందరు కలెక్టరేట్ రెవెన్యూ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు.

ఏడాది గడుస్తున్నా..

జిల్లా పరిధిలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు సంవత్సరకాలంగా జీతభత్యాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. 12నెలలుగా వేతనాలు రాక.. అప్పు చేసి జీవనాన్ని గడపాల్సి వస్తోందని చిరుద్యోగులైన ఆపరేటర్లు వాపోతున్నారు. 'పేరుకు రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్నా.. తమకు మాత్రం రెవెన్యూ లేక ఇబ్బందిపడుతున్నాము' అని సదరు ఉద్యోగులు కలత చెందుతున్నారు.

పస్తులుండాల్సి వస్తోంది



ఏడాది కాలంగా వేతనాలు రావడం లేదు. జీతం రాకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నాం. ఉంటున్న ఇంటికి అద్దె కట్టలేకపోవడంతో పాటు.. పస్తులు ఉండాల్సి వస్తోంది. అప్పులు చేసి జీవితాన్ని గడుపుతున్నాం. జీతాలు త్వరగా వచ్చేలా చేసి తమను ఆదుకోవాలి.

– రాజేష్, రెవెన్యూ కంప్యూటర్ ఆపరేటర్, కుల్కచర్ల

అవస్థలు పడుతున్నాం



కంప్యూటర్ ఆపరేటర్స్ జీతభత్యాలు చెల్లించేందుకు ప్రభుత్వం సరైన నిధులు కేటాయించడం లేదు. దీంతో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆపరేటర్లకు జీతాలు అందడం లేదు. వేతనాలు అందక కిందిస్థాయి సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. వెంటనే ప్రభుత్వం ఆపరేటర్లకు త్వరితగతిన జీతాలు చెల్లించి ఆదుకోవాలి.

– హన్మంతు యాదవ్, కంప్యూటర్ ఆపరేటర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

బాలల పరిరక్షణ అందరి బాధ్యత

ఎంపీడీఓ శైలజారెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శైలజారెడ్డి

మోమిన్‌పేట: బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని ఎంపీడీఓ శైలజారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని చీమల్‌ధరి గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన బాలల పరిరక్షణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లల పరిరక్షణపై తల్లిదండ్రులకు ఎంత బాధ్యత ఉందో సమాజంలోని ప్రతి ఒక్కరికి అంతే బాధ్యత ఉందని చెప్పారు. బాలలను ప్రతి రోజు పాఠశాలకు పంపించే విధంగా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆమె సూచించారు. ఎవరైతే పాఠశాలలకు తరచుగా గైర్హాజరు అవుతారో వారి ఇంటికి వెళ్లి ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో మాట్లాడాలని ఆమె చెప్పారు. ఆరోగ్యం విషయాల్లో కూడా ఉపాధ్యాయులు విద్యార్థులను కనిపెట్టుకొని ఉండాలని, అందరి బాధ్యతగా గుర్తించినప్పుడే పిల్లలందరూ బాగుంటారని వెల్లడించారు. ప్రతి మూడు నెలలకోసారి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి, సమీక్ష నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా 'కంటివెలుగు'



గాజీపూర్ కంటివెలుగు శిబిరంలో నేత్ర పరీక్ష చేస్తున్న వైద్యులు

పెద్దేముల్: ప్రజల జీవితాల్లో వెలుగును నింపేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమం మండలంలో విజయవంతంగా కొనసాగుతోంది. రెండు క్యాంపులు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని చేపడుతున్నారు. అడ్కిచెర్ల, బండమీదిపల్లి, మారేపల్లితండా, బాయిమీదితండా, జైరాంతండా (తట్టెపల్లి), కందనెల్లి, ఆత్కూర్, ఎర్రగోడుతండా, బుద్దారం, గాజీపూర్, గిర్మాపూర్, బండపల్లితో పాటు పలు గ్రామాల్లో 7,988 మందికి కంటి పరీక్ష చేసి, 1,609 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామని పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి బుచ్చిబాబు తెలిపారు. మనిషి శరీరంలో కన్ను అతి ముఖ్యమైన అవయవమని, 18 ఏళ్లు నిండిన వారందరికీ ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు, అద్దాలు అందచేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తున్నామని వెల్లడించారు.

పెరిగిన ధరలు.. పొలాలకు రోడ్లు

హర్షంవ్యక్తం చేస్తున్న రైతులు



పెద్దేముల్‌లో పంట పొలాలకు వేసిన రోడ్లు

పెద్దేముల్: స్థిరాస్తి వ్యాపారుల పుణ్యమా భూముల ధరలు పెరగటంతో పాటు పంట పొలాలకు దారులు పరుచుకుంటున్నాయి. రెండేళ్ల క్రితం రూ.5లక్షల వరకు ఉన్న ఎకరా భూమి ధర నేడు రూ.40 నుంచి రూ.50లక్షలు ఎగబాకింది. పంట పొలాలకు దారులు లేని వాటికి కూడా.. రియల్టర్లు భూములు విక్రయించి రోడ్లు నిర్మిస్తున్నారు. పంట పొలాలకు వెళ్లడానికి సరైన రోడ్డుమార్గం లేక ఏళ్ల తరబడి రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం కాని సమస్యకు రియల్టర్ల రూపంలో పరిష్కారం దొరకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలా అడవుల్లా తలపించే పంట పొలాల పరిసర ప్రాంతాలు నేడు పూర్తిగా రూపురేఖలు మారిపోయాయి. దీంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. కర్ణాటక సరిహద్దులో ఉండి, రాజధానికి సుమారు 110 కిలో మీటర్ల దూరంలో పెద్దేముల్ మండలం ఉన్నప్పటికీ.. భూములకు నానాటికీ డిమాండ్ పెరుగుతోంది. హైదారాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, సంగారెడ్డి ప్రాంతాల నుంచి ప్రజలు.. ఇక్కడి భూములను ఖరీదు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల రూపంలో రూ.కోట్ల మేర ఆదాయం సమకూరుతోంది.

గ్రామానికో హరితవనం

- ఉపాధి పొందుతున్న కూలీలు
- నిర్వహణ పనులు పరిశీలిస్తున్న అధికారులు
- మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి
- తొమ్మిదో విడత హరితోత్సవానికి మొక్కలు సిద్ధం

దౌల్తాబాద్: తెలంగాణలో పచ్చదనం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2015 జులైలో హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తొమ్మిదో విడతకు (హరితోత్సవానికి) నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

పంచాయతీ ఆధ్వర్యంలో..

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రతి పంచాయతీకో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపడుతున్నారు. మండలంలోని 33 జీపీల్లో నర్సరీలను సిద్ధం చేయడంతో పాటు.. నిర్వహణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ప్రతి పంచాయతీలో 5వేల మొక్కల చొప్పున మొత్తం మండల వ్యాప్తంగా 1.65లక్షలు మొక్కలు పెంచేందుకు సన్నద్ధమవుతున్నారు.

పూలు, ఫలాల మొక్కలు సిద్ధం

మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఆలయ ప్రాంగణాలు, బస్టాండ్, రోడ్లకు ఇరువైపులా రైతులకు ఉపయోగపడే అన్ని రకాల మొక్కలు నాటించేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు నర్సరీల్లో పండ్ల మొక్కలు నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, ఉసిరితో పాటు పూల మొక్కలైన గులాబీ, మందార, గన్నేరు, కాగితపు పూల మొక్కలతో పాటు రోడ్డుకు ఇరువైపులా నాటేందుకు జామ, మారేడు వంటి మొక్కలను సిద్ధం చేస్తున్నారు. గ్రామాల్లో జరుగుతున్న నర్సరీ పనులను ఉన్నతాధికారులతో పాటు ఎంపీడీఓ రవీందర్, ఏపీఓ రంజిత్‌కుమార్ పరిశీలిస్తున్నారు.

కూలీలకు ఉపాధి

జీపీల్లో మొక్కల పెంపకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. మొక్కల పెంపకం పనులతో ఒక్కో గ్రామంలో 40మంది కూలీలకు ఉపాధి దొరుకుతోంది. ప్రస్తుతం నర్సరీల్లో మట్టి పనులు, కవర్లలో మట్టి నింపి మొలకలను నాటించడం, నర్సరీలకు నీరు పట్టడం వంటి పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు.



నీటూరు గ్రామంలో నర్సరీ పనుల్లో వనసేవకులు

పనులు పర్యవేక్షిస్తున్నాం



గ్రామాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో నర్సరీ పనులు వేగంగా సాగుతున్నాయి. తొమ్మిదో విడత హరితహారం పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం నర్సరీలు, మొక్కల పెంపకం పనులను పర్యవేక్షిస్తూ నిర్వాహకులకు సూచనలు, సలహాలు ఇస్తున్నాం.

– రవీందర్, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ, దౌల్తాబాద్

అయోడిన్ లోపంతో అనేక ఇబ్బందులు



విద్యార్థులకు అయోడిన్ లోపాల గురించి వివరిస్తున్న వైద్యాధికారి శ్రీనివాస్

సబ్ సెంటర్ వైద్యాధికారి శ్రీనివాస్

దోమ: అయోడిన్ లోపం అనేక రుగ్మతలకు దారి తీస్తుందని సబ్ సెంటర్ వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల పరిధిలోని దాదాపూర్ గ్రామంలోని సబ్ సెంటర్‌లో జాతీయ అయోడిన్ రుగ్మతల నివారణ దినోత్సవాన్ని ఏఎన్‌ఎం, ఆశవర్కర్లతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పాఠశాల వెళ్లి విద్యార్థులకు అయోడిన్ రుగ్మతల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయోడిన్ లోపం వల్ల ముఖ్యంగా మహిళల్లో గర్భస్రావం, మృత శిశు జననం, గొంతువాపు, మరుగుజ్జుతనం, చిన్నపిల్లల్లో ఆటిజం, బుద్ధిమాంద్యం, వయసుకు తగ్గ చురుకుదనం లేకపోవడం వంటి లక్షణాలు సంభవిస్తాయని తెలిపారు. గ్రామాల్లో ఉన్న ప్రతి కుటుంబం అయోడిన్ ఉప్పు వాడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య, పీహెచ్ఎస్ (పోస్ట్‌హెపెటిక్ న్యూరల్జియా) రాజమణి, ఏఎన్‌ఎం చంద్రకళ, ఆశవర్కర్ మాధవి, గౌరమ్మ, లక్ష్మి, అంజమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

వికలాంగుల హక్కుల కోసం పోరాటం

పరిగి: వికలాంగుల హక్కుల కోసం పోరాటాలు చేస్తూనే ఉంటామని వికలాంగుల హక్కుల పోరాట సమితీ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. గురువారం సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణ కేంద్రంలో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ఏర్పడిన 13 సంవత్సరాల్లో ఎన్నో హక్కులను సాధించుకున్నామని తెలిపారు. దివ్యాంగులకు సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై నిత్యం పోరాటం చేస్తూనే ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దశరథ్, మండల అధ్యక్షుడు అనంతలక్ష్మి, గణేశ్ పాల్గొన్నారు.

గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

కుల్కచర్ల: కుల్కచర్ల గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని సర్పంచ్ సౌమ్యారెడ్డి చెప్పారు. గురువారం జీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఆమే మాట్లాడారు. గ్రామస్తుల అవసరాల మేరకు గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని వార్డుసభ్యులు, స్థానిక నేతలు వెంకటేశ్, మైపాల్, ఆంజనేయులు సర్పంచికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'వ్యసనాలకు దూరమైతేనే భవిష్యత్'



సమావేశంలో మాట్లాడుతున్న ఆధ్యాత్మికవేత్త భాస్కరయోగి

కుల్కచర్ల: యువత చెడు వ్యసనాలకు దూరమైనప్పుడే ఉన్నత లక్ష్యాలను చేరగలుగుతారని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త భాస్కరయోగి అన్నారు. గురువారం అంతారంలో పరిగి నియోజకవర్గ పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో యువ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మన పురాతన ఆచార సాంప్రదాయాలు, ధర్మం వంటి వాటిని పరిరక్షించుకోవడంతో పాటు చెడువ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజహితమైన కార్యక్రమాలలో పాల్గొనాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి దేశభక్తి, సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా పరిగి నియోజకవర్గ పరిరక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘువేందర్ గౌడ్ ఆధ్వర్యంలో సంఘ మండల అధ్యక్షుడిగా హరికృష్ణను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రలింగం, గోపాలకృష్ణ, బాలకృష్ణ, మహేశ్, వెంకటేశ్, రాంచంద్రయ్య, వెంకట్రాములు, గోపాల్, బాలయ్య, జలీల్, పాండు, తిరుపతయ్య పాల్గొన్నారు.

ఘనంగా సంత్ గాడ్గే బాబా జయంతి



బాబా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రజక, ప్రజా సంఘాల నాయకులు

కొడంగల్ రూరల్: రజక రిజర్వేషన్ సమితీ ఆధ్వర్యంలో గురువారం సంత్ గాడ్గే బాబా 147వ జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో బాబా చిత్రపటానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. గ్రామాల్లో పరిశుభ్రత, తోటి వారికి సహాయపడే లక్షణాలు, కులనిర్మూలన, ఆధ్యాత్మిక చైతన్యం వంటి వాటిని ప్రచారం చేస్తూ అనేక పాఠశాలలు స్థాపించిన మహనీయుడు సంత్ అని కొనియాడారు. గొప్ప వ్యక్తిత్వం కలిగిన ఆయన సేవలను ప్రభుత్వం గుర్తిస్తూ అధికారికంగా జయంతిని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితీ (టీఆర్‌ఆర్‌ఎస్) జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవీందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, ప్రజా సంఘాల నాయకులు చంద్రయ్య, రమేష్‌బాబు, బుస్స చంద్రయ్య, సూర్యానాయక్, అశోక్, కాశీనాథ్, వెంకటయ్య, రఘుపతి, శ్రీనివాసులు, లింగం సాయిలు, లక్ష్మయ్య, చిన్నయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న నందకుమార్‌యాదవ్

పరిగి: పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు నందకుమార్‌యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మిట్టకోడూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజాగోస–బీజేపీభరోసా కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రజల పక్షాన నిలబడే పార్టీగా.. ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజల తరుపున పోరాటం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, పార్టీ అభ్యున్నతికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మిట్ట పరమేశ్వర్ రెడ్డి, రూప్‌ఖాన్‌పేట్ సర్పంచ్ నర్సింహా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్



వరి పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి గోపాల్

పరిగి: రైతులు తప్పకుండా వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తప్పకుండా పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ సూచించారు. గురువారం మండల పరిధిలోని సొండేపూర్ గ్రామంలోని రైతులు సాగు చేసిన వరి పంటను సందర్శించి, పలు సలహాలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరి సాగు అనుకున్న విధంగా దిగుబడి రావాలంటే మోతాదులో మందులను చల్లాలని చెప్పారు. వరికి తప్పకుండా పొటాష్‌ను ఎకరానికి 25కిలోలు చిరుపొట్ట దశలో చల్లాలని సూచించారు. యూరియాను మూడు దఫాలుగా చల్లాలన్నారు. పిలకల దశలో 25కిలోలు, అంకరము ఆరంభ దశలో 25కిలోలు, ఎన్ను బయట పడేటప్పుడు 25కిలోలు చల్లాలని చెప్పారు. దీంతో రైతులు సాగు చేసిన వరి పంటలకు ఎలాంటి చీడపీడలు దరిచేరకుండా.. పంట ఆరోగ్యంగా ఉండటంతో అధిక దిగుబడిని పొంది రైతులు ఆర్థికంగా ఎదుగుతారని తెలిపారు. కావున రైతులు తప్పకుండా వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తప్పకుండా పాటించి, అధిక దిగుబడులను పొందాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ, రైతులు బాల్‌రెడ్డి, సురేష్‌చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28న బీఎస్పీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య

మర్పల్లి: ఈ నెల 28న వికారాబాద్ పట్టణంలో నిర్వహించే బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ వికారాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్ది అంజయ్య కార్యకర్తలకు సూచించారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు అధిక సంఖ్యలో కార్యకర్తలను తరలించేందుకు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమానికి సెంట్రల్ కోఆర్డినేటర్ రాజ్యసభ సభ్యుడు రాంజీ, రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ మంద ప్రభాకర్, రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్‌లు హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మైనార్టీసెల్ జిల్లా కార్యదర్శి సయ్యద్ అమీర్, అసెంబ్లీ అధ్యక్షుడు తలారి రాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.